నేడు డయల్ యువర్ డీఎం

అల్వాల్: హకీంపేట డిపోలో నేడు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ భవభూతి తెలిపారు. హకీంపేట డిపో పరిధిలో ఉన్న ప్రయాణికుల సందేహాలు, సమస్యలపై సంప్రదించాల్సిన నంబరు డిపో మేనేజర్ 9959226144.

బోడుప్పల్: ఆర్టీసీ చెంగిచర్ల డిపో పరిధిలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కవిత ఓ ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల నుంచి సలహాలు, సూచనలు తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు 7893088433 నంబరును సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రామంతాపూర్: ఉప్పల్ భగాయత్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధి, దేవేందర్‌నగర్ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు దేవేందర్‌నగర్, లక్ష్మీనారాయణ కాలనీ, బస్తీ దవాఖాన లైన్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

తాగునీటి వృథా



రామంతాపూర్ : ప్రధాన రహదారిలో బస్టాండ్ వద్ద గత పది రోజులుగా తాగునీటి పైపులైన్ పగిలి నీరు వృథాగా పోతోంది. దీంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జలమండలి అధికారులు వెంటనే స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి లీకేజీని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పోలీసుల చేయూత



మల్కాజిగిరి: మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్‌లో ఔట్‌సోర్సింగ్ విధులు నిర్వహిస్తున్న యాదమ్మకు పోలీసులు చేయూతను అందించారు. ఈనెల 6న పోలీస్‌స్టేషన్ సమీపంలోనే గత కొన్నేళ్లుగా పానిపూరి బండి నిర్వహిస్తున్న యాదమ్మ భర్త ఆంజనేయులు విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. ఆమె కుటుంబానికి అండగా ఉండాలనే ఉద్దేశంతో పోలీస్‌స్టేషన్‌లో అందరూ కలిసి రూ.1,0,6000లను ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, డీఐ శ్రీశైలం, ఎస్సై సునీల్‌కుమార్‌లు ఆమెకు అందజేశారు.

హత్యకు గురైన యువకుడి గుర్తింపు

కుషాయిగూడ: చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం హత్యకు గురైన 35 ఏళ్ల యువకుడి వివరాలను పోలీసులు తెలుసుకున్నారు. జార్ఖండ్‌కు చెందిన బాబు సోల్ టాడుగా తేల్చి అతడి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చినట్లు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు. మృతుడి జేబులో లభించిన థర్డ్ పర్సన్ బ్యాంకు నెంబరు ఆధారంగా అచూకీ తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. కాగా మృతుడికి వివాహమైందని, భార్యాభర్తలు విడిపోవడంతో వేర్వేరుగా ఉంటున్నట్లు చెప్పారు. కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చినప్పటికీ వారు వస్తారనే నమ్మకం కనిపించడం లేదని పోలీసులు చెబుతున్నారు. దర్యాప్తు కొనసాగుతుందని స్పష్టం చేశారు.

నేరెడ్‌మెట్‌లో చైన్ స్నాచింగ్

అల్వాల్: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కెళ్లిన ఘటన నేరెడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్‌కు చెందిన పూజిత (25) సంక్రాంతి పండుగకు నేరేడ్‌మెట్ గీతానగర్‌లోని తన అమ్మవారింటికి వచ్చింది. గురువారం మెడికల్ షాపుకి వెళ్లి తిరిగి వస్తుండగా వెనుక నుంచి వచ్చిన దుండగులు ఆమె మెడలోనుంచి 2.5 తులాల బంగారు గొలుసును లాక్కెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.1.50 లక్షలు పలికిన వెంకన్న లడ్డూ

మేడ్చల్‌రూరల్: మండల పరిధిలోని క్షేత్రగిరి వేంకటేశ్వర స్వామి లడ్డూ రూ.1 లక్షా 50 వేలు పలికింది. వేంకటేశ్వరస్వామి జాతర సందర్భంగా స్వామివారికి పెట్టిన లడ్డూను గురువారం ఆలయ అధికారులు వేలం పాట నిర్వహించగా రాజబొల్లారం తండాకు చెందిన రమేష్ నాయక్ వేలంలో దక్కించుకున్నారు.

ప్రచార ఆర్భాటం.. పరిశుభ్రత శూన్యం

- గార్బేజ్ పాయింట్లు ఎత్తివేత
- స్వచ్ఛ ఆటోలపై పర్యవేక్షణ కరువు
- పెరిగిపోతున్న వ్యర్థాలు



కాప్రా సర్కిల్ కార్యాలయం



కాప్రా: జీహెచ్ఎంసీ కాప్రా సర్కిల్‌లో వ్యర్థాల విషయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సర్కిల్‌లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టమని అధికారులు ప్రచారం చేస్తున్నా.. అమలుకు నోచుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్వచ్ఛ సర్కిల్‌గా చేయాలనే ఉద్దేశంతో సర్కిల్‌లో ఏర్పాటు చేసిన గార్బేజ్ పాయింట్లను ఎత్తివేశారు.

కనిపించని స్వచ్ఛ ఆటోలు..

ఇంటి నుంచి నేరుగా డంపింగ్ యార్డుకే చెత్తను తరలించాలని ఇంటింటికి చెత్త సేకరణ ఆటోలు ఏర్పాటు చేశారు. అయితే ఈ ఆటోలకు కేటాయించిన కాలనీల్లో ప్రతి గల్లీ, ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలి. కానీ కొందరు ఆటో నిర్వాహకులు రెండు, మూడు రోజులకోసారి వెళ్తుండటంతో లక్ష్యం నెరవేరలేకపోతుంది.

పేరుకుపోతున్న చెత్తా, చెదారం..

రోజువారీ సేకరణ లేకపోవడంతో ఇంట్లో చెత్తకుప్ప పేరుకుపోయి దుర్వాసన వస్తుంది. దీంతో గత్యంతరం లేక చెత్తను ఏదో ఒక ఖాళీ ప్రదేశాల్లో వదిలివెళ్తున్నారు. ఫలితంగా వీధి చివర, ఖాళీ ప్రదేశాల్లో చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. దీనికి ముఖ్యకారణం జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య అధికారుల పర్యవేక్షణ లోపమేనని పలువురు అభిప్రాయపడుతున్నారు.

క్షేత్రస్థాయి పర్యవేక్షణేది.. ?

క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను గాలికొదిలేసి సీసీ కెమెరాలతో అవగాహన కల్పిస్తే లాభమేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇంటింటికి చెత్త సేకరణ ఆటోలు రోజూ రాకపోవడంతో ఇంట్లో చెత్తతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. బయట గార్బేజ్ పాయింట్లు లేక చెత్తను ఎక్కడ వేయాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. చెత్త కవర్‌తో నేరుగా తామే డంపింగ్ యార్డుకు క్యూ కట్టాలా అని జనం ప్రశ్నిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ సరిగ్గా లేకుండా ప్రచార ఆర్భాటాలు ఎందుకని పలువురు అభిప్రాయపడుతున్నారు.

పర్యవేక్షణ లోపం..

ఇంటింటి చెత్త సేకరణ ఆటోలు నిత్యం ప్రతి ఇంటికి వెళ్లి సేకరిస్తున్నారా.. లేదా అనే విషయాన్ని జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలి. అసలు పారిశుద్ధ్య విభాగం విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఏం చేస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. నిత్యం ఉరుకులు పరుగుల జీవనశైలిలో ప్రజలు వారి ఉద్యోగ, ఉపాధి, వ్యాపార పనులపై ఉదయాన్నే ఇంటి నుంచి వెళ్తారు. అందరూ వెళ్లిన తర్వాత తీరిగ్గా కాలనీకి చెత్త సేకరణకు వస్తే ఎలా అని ప్రశ్నిస్తున్నారు.

విరాళాలు వస్తున్న ఆశయానికి తూట్లు..

సామాజిక బాధ్యతతో కాలనీ అసోసియేషన్లు, వ్యాపారస్తులు, పలువురు పర్యావరణ ప్రియులు సీసీ కెమెరాలను విరాళంగా ఇస్తున్నారు. నగరం పరిశుభ్రంగా ఉండేందుకు తమ బాధ్యతగా స్వచ్ఛందంగా ముందుకొచ్చి విరాళాలు ఇస్తున్నా.. వారి ఆశయానికి ఫలితం లేకుండా పోతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ప్రణాళిక బద్ధంగా చర్యలు చేపట్టకపోవడంతో దాతల సహకారం కూడా వృథా అవుతుందని పలువురు వాపోతున్నారు.

క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ ఉండాలి

చెత్త సేకరణ ఆటోలు ఇంటింటికి ప్రతిరోజూ వెళ్లాలి. దీనికి జీహెచ్ఎంసీ అధికారుల పర్యవేక్షణ లోపమే కారణం. చెత్తసేకరణ ఆటో వస్తుందా.. లేదా అని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలి. అధికారులు క్షేత్రస్థాయిలో నిత్యం పర్యవేక్షించి ఆటోలు వెళ్లేలా చూస్తే లక్ష్యం తప్పక నెరవేరుతుంది. స్వచ్ఛ హైదరాబాద్ కల సాకారమవుతుంది.

– పద్మారెడ్డి, చర్లపల్లి కాలనీస్ కో– ఆర్డినేషన్ కమిటీ ప్రెసిడెంట్

రిపోర్టులపై ఆధారపడకూడదు

కేవలం ప్రచారాలకు మాత్రమే పరిమితమైతే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేం. క్షేత్రస్థాయిలో నిత్యం సిబ్బంది పర్యవేక్షణ ఉండాలి. సిబ్బంది పనితీరుపై కూడా ఉన్నతాధికారులు తెలుసుకునే ప్రయత్నం చేయాలి. లేదంటే కేవలం రిపోర్టులపైనే ఆధారపడితే ప్రజలు సమస్యలతో కొట్టుమిట్టాడుతూనే ఉంటారు. మిగిలిన సమయాల్లో కూడా అలానే కొనసాగితే స్వచ్ఛ హైదరాబాద్, క్లీన్ సిటీ లక్ష్యం నెరవేరుతుంది.

– డాక్టర్ కుమారస్వామి, ప్రొఫెసర్

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం



కుట్టుమిషన్లు అందజేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: రోటరీ క్లబ్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం రోటరీ క్లబ్ ప్రతినిధి బబ్బూరి బాలరాజుగౌడ్ 20 కుట్టుమిషన్లను మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రోటరీ క్లబ్ అందజేసిన కుట్టుమిషన్లతో ఉపాధి పొంది ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. బాలరాజుగౌడ్ సేవలను ఎమ్మెల్యే అభినందించారు. కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, శ్రీనివాస్‌రెడ్డి స్థానిక నేతలు మహేష్‌గౌడ్, నర్సింహ్మా, శ్రీకాంత్‌రెడ్డి, చక్రపాణిగౌడ్ పాల్గొన్నారు.

పీర్జాదిగూడ బీజేపీ ఈస్ట్ అధ్యక్షుడిగా ప్రభాకర్‌రెడ్డి



ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎంపీ ఈటల

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ ఈస్ట్ అధ్యక్షుడిగా జమ్ముల ప్రభాకర్‌రెడ్డి ఎన్నికయ్యారు. గురువారం ఎంపీ ఈటల రాజేందర్ కొంపల్లి మోహన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డిలను ఈ సందర్భంగా అభినందించారు. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పీర్జాదిగూడ ఈస్ట్, మేడిపల్లి పర్వతాపూర్‌లకు అధ్యక్షుడిగా నియమించినందుకు పార్టీ అధిష్ఠానం పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తన సేవలను గుర్తించి అధ్యక్ష పదవికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు పటోళ్ల విక్రంరెడ్డి, జిల్లా యువ మోర్చా అధ్యక్షుడు బండారు పవన్‌రెడ్డి, సీనియర్ నేతలు జైపాల్‌రెడ్డి, శాడిగొండ కరుణాకర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు

కీసర: తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాలని ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డికి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆశా వర్కర్ల యూనియన్ ఉపాధ్యక్షురాలు ఆర్.రాధ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం వినతిపత్రం అందజేశారు. అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి, పార్లమెంట్‌లో పీఎం నరేంద్ర మోదీకి ఆశా వర్కర్ల సమస్యలను ప్రస్తావించి పరిష్కరించాలని ఈటలతో పాటు మల్లారెడ్డిని కోరారు. ఆశా వర్కర్లకు నెలకు రూ. 18 వేలు జీతం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు.

మెకానిక్‌ల సమస్యలు పరిష్కరిస్తా



ఎంపీ ఈటలతో మెకానిక్ అసోసియేషన్ సభ్యులు

మల్కాజిగిరి: టూవీలర్ మెకానిక్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. హెచ్ఎంఆర్ టూవీలర్స్ మెకానిక్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఆయనను కలిసి సమస్యలను తెలియజేశారు. అనంతరం నూతన కేలండర్‌ను ఆవిష్కరించారు. ఉపాధ్యక్షుడు జగన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి నరేందర్‌యాదవ్, కోశాధికారి మహిపాల్‌రెడ్డి, శివ, ఉమామహేశ్వరరావు, సుధాకర్, లింగం, కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

గట్టుమైసమ్మ జాతర ఏర్పాట్లు పరిశీలన



జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: పట్టణంలోని గట్టుమైసమ్మ జాతర ఏర్పాట్లను మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ నెల 19న జరుగనున్న జాతరలో పార్కింగ్ కోసం ట్రాఫిక్ అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఆలయం పరిసరాలను సిబ్బందితో శుభ్రం చేయించారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓ భాగ్యలక్ష్మీ, కౌన్సిలర్లు ఆంజనేయులుగౌడ్, మల్లేష్, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షప్రధాన కార్యదర్శి ముత్యాలుయాదవ్, రాధాకృష్ణముదిరాజ్, యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు జంగారెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ మాజీ డైరెక్టర్ జంగారెడ్డి, ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

రూ. 1.43 కోట్లతో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



ఆరోగ్య కేంద్రానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి తదితరులు

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లిలో రూ. 1.43 కోట్లతో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ) నిర్మిస్తున్నట్లు మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. గురువారం రాంపల్లిలో ఆరోగ్య కేంద్రం నిర్మించేందుకు ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఈటల మాట్లాడుతూ.. ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, కమిషనర్ భాస్కర్‌రెడ్డి, వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ఆరోగ్యశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేత



మేడ్చల్‌రూరల్: రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌ను గురువారం రజక సంఘం నాయకులు కలిశారు. రాష్ట్రంలో కార్పొరేట్ సంస్థల పేరుతో లాండ్రీలు, దోబీల పేరు చలామణి అవుతుండడంతో రజకులు ఉనికి కోల్పోవాల్సి వస్తోందని వెంటనే వాటిని తొలగించి రజక, చాకలి అనే పదాలతో పేర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రజక సంఘాల జేఏసీ చైర్మన్ పంజాగారి ఆంజనేయులు, జిల్లా అధ్యక్షులు యుగపతి, జంగయ్య, శ్రీనివాస్, శ్రీశైలం, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు !

భయాందోళన చెందుతున్న ప్రజలు

గౌతంనగర్: డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఎత్తు తక్కువగా ఉండి ప్రమాదకరంగా మారుతున్నాయి. దీనివల్ల ఏ ప్రమాదం జరుగుతుందోనని పలు ప్రాంతాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ప్రధానంగా మల్లిఖార్జుననగర్, సెవెన్‌హిల్స్ స్కూల్, ఇందిరానెహ్రూనగర్, మిర్జాలగూడ తదితర ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఎత్తు తక్కువ ఉండటం వల్ల ప్రమాదం పొంచి ఉందని, పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి ప్రమాదకర ట్రాన్స్‌ఫార్మర్లపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కంచె లేకుండా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

రోజూ భయపడుతున్నాం...



మల్లిఖార్జుననగర్ సెవెన్‌హిల్స్ పాఠశాల సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కంచె లేకుండా ప్రమాదకరంగా ఉంది. దీనికి తోడు వైర్లు కిందికి వేలాడుతూ.. ఉండటంతో నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే ఈ రోడ్డులో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నాం. అధికారులు స్పందించి తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలి.

– శ్రీనివాసన్, మల్లిఖార్జుననగర్

అధికారులు స్పందించాలి...



గౌతంనగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. ఎత్తు తక్కువగా ఉండి కంచె లేకపోవడంతో మూగజీవాలు సైతం ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

– సిరిగిరి విజయ్‌కుమార్, మల్లిఖార్జుననగర్

వ్యక్తి అదృశ్యం



అక్షయ్య

మేడిపల్లి: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కమళనగర్‌లో నివాసం ఉంటున్న తన కుమార్తె వద్దకు వారం క్రితం వచ్చిన కాసర్లపాడు గ్రామం, అర్వపల్లి మండలం, సూర్యాపేట జిల్లాకు చెందిన జువ్వి అక్షయ్య(65)వృత్తి వ్యవసాయం సోమవారం మధ్యాహ్నం 1.30గంటల సమయంలో కుమార్తె ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇప్పటి వరకు తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఊరెళ్లొచ్చేసరికి ఇల్లు గుల్ల..

5 తులాల బంగారం ఎత్తుకెళ్లిన దుండగులు

మేడిపల్లి: ఊరెళ్లొచ్చేసరికి వరుసగా రెండు ఇళ్లల్లో తాళాలు పగులగొట్టి బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్ మున్సిపల్ పరిధి తిరుమల మెడోస్ గేటెడ్ కమ్యూనిటీ కాలనీలో నివాసం ఉంటున్న మహమ్మద్ అజీద్, కూరెళ్ల ప్రతాప్ నగరంలో ప్రైవేట్ ఉద్యోగులు. కాగా గత మూడు రోజుల క్రితం కుటుంబసభ్యులతో కలిసి ఊరెళ్లి తిరిగొచ్చేసరికి ఇళ్ల తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించారు. లోపలికి వెళ్లి చూసేసరికి వారి ఇంట్లో చోరీ జరిగిందని గుర్తించిన బాధితులు బుధవారం మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యవసాయేతర భూములను జాగ్రత్తగా గుర్తించాలి



సిబ్బందికి సూచనలు ఇస్తున్న కలెక్టర్



క్షేత్రస్థాయి పర్యటన వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

కీసర: క్షేత్రస్థాయి పర్యటనలు జరిపి వ్యవసాయానికి యోగ్యమైన భూమియేనా కాదా అని జాగ్రత్తగా గుర్తించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కీసర తహసీల్దారును మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం పోట్రు ఆదేశించారు. గురువారం కీసర ఆర్డీఓ కార్యాలయంలో గ్రామాల సర్వే నెంబర్ల వారీగా వ్యవసాయేతర భూములను గుర్తించే క్షేత్రస్థాయి పర్యటనల వివరాలను.. జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా గౌతం మాట్లాడుతూ.. జీపీఆర్ మ్యాప్‌ను పరిశీలిస్తూ క్షేత్రస్థాయి పర్యటనలు జరిపి భూములు వ్యవసాయ యోగ్యమైనవో, కావో కచ్చితంగా గుర్తించి సమగ్ర నివేదికను తయారు చేయాలన్నారు. అవసరమైన చోట సర్వేయర్ల నుంచి సమాచారం సేకరించి లేఅవుట్లు, నివాసప్రాంతాలు, పరిశ్రమలకు సంబంధించిన భూముల వివరాలను కచ్చితంగా సేకరించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం మ్యాప్‌తో చీర్యాల, గోధుమకుంట గ్రామాల సర్వే నెంబర్ల ద్వారా పరిశీలించి సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో లా–ఆఫీసర్ చంద్రావతి, కీసర తహసీల్దారు అశోక్ కుమార్, ఆర్ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

షెల్టర్ హోమ్‌కు మైనర్ల తరలింపు

ఘట్‌కేసర్: ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా ఘట్‌కేసర్ పోలీసులు మున్సిపాలిటీలోని పలు దుకాణాలను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ముగ్గురు మైనర్ బాలురు, ఒక మైనర్ బాలికతో పని చేయిస్తున్న దుకాణాల యజమానులపై చైల్డ్ లేబర్ చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. వారిని చైల్డ్ లేబర్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరుపరచగా.. షెల్టర్ హోమ్‌కు తరలించారు. అలాగే బుధవారం ముగ్గురు మైనర్ బాలురను షెల్టర్ హోమ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ పరశురాం మాట్లాడుతూ.. మైనర్లతో పని చేయిస్తే చైల్డ్ లేబర్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైభవంగా ముగిసిన ధనుర్మాస పూజలు

ఘట్‌కేసర్: ఎదులాబాద్ శ్రీగోదా సమేత శ్రీ రంగనాయక స్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు గురువారం ఘనంగా ముగిశాయి. ఆలయ వేదపండితులు అమ్మవారికి పంచామృత అభిషేకం నిర్వహించి గ్రామంలో ఊరేగించారు. అనంతరం కల్యాణ మండపంలో అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు చేసి నోము నిర్వహించి ధనుర్మాస పూజలు ముగించారు.